## క్లుప్తంగా

### ఆయుర్వేద వైద్య శిబిరం



వైద్య పరీక్ష చేస్తున్న ఆయుర్వేద వైద్యుడు నగేష్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన సామాజిక కార్యకర్త మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు బీవీఎం నగేష్ 116 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఆయుర్వేద వైద్యంలో అన్ని వ్యాధులకూ చికిత్స ఉందని చెప్పారు. శిబిరంలో బలిసెట్టి సురేష్, పిల్లి పండరీనాథ్ తదితరులు సేవలందించారు.

### జ్యోతిబా పూలే ఆశయ సాధనకు కృషి



మాట్లాడుతున్న బద్దా వెంకట్రావు

ఏలూరు (టూటౌన్): జ్యోతిబాపూలే 198వ జయంతి పురస్కరించుకుని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ ఏలూరు నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏలూరు జూట్ మిల్ ఫ్లైఓవర్ పక్కన ఉన్న పులే స్టాట్యూకు పూల మాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పార్టీ ఏలూరు నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ జ్యోతిబాపూలే ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో యర్రా శ్రీనివాసరావు, సందకం అప్పారావు, కోరాడ అప్పారావు, గడసాల రమణ, దుర్గారావు, నకిరెడ్డి లక్ష్మణ్, కరణం అప్పారావు, సన్యాసిరావు, మోహన్, భార్గవ, రాజు తదితరులు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

దెందులూరు: ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పళ్లెం ప్రసాద్, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, జిల్లా కార్యదర్శి డి.ప్రేమ్ బాబు పిలుపునిచ్చారు. శనివారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో వారు మాట్లాడారు. సామాజిక అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా అంబేడ్కర్ తన జీవితాన్ని ధారపోశారని గుర్తుచేశారు.

# భానుడి భగభగలు

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వడదెబ్బపై అవగాహన అవసరం

ఏలూరు టౌన్: రోజు రోజుకూ భానుడు భగభగా మండిపోతున్నాడు. తీవ్రమైన వేడిగాలులకు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రోడ్డుపైకి రావాలంటే బెంబేలెత్తిపోతున్నారు. గత ఐదు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, అప్రమత్తంగా లేకుంటే ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇంటి నుంచి బయటకెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

**ఇంటింటా అవగాహన**

ఏలూరు నగరంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, మలేరియా విభాగం అధికారులు, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు, సిబ్బంది ప్రజల వద్దకు వెళ్లి వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు ఆధ్వర్యంలో మహిళలకు, వృద్ధులకు అవగాహన కల్పిస్తున్నారు. కండ్రికగూడెం, బీడీకాలనీ, ఇజ్రాయేలు పేట, లంకపేట, తంగెళ్లమూడి, యాదవనగర్, ఎంఆర్‌సీ కాలనీ, చొదిమెళ్ల, మాదేపల్లి, శనివారపుపేట, వైఎస్సార్ కాలనీ, కొత్తపేట, 12 పంపుల సెంటర్, పవర్‌పేట తదితర ప్రాంతాల్లో నిత్యం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వడదెబ్బతో తీవ్రమైన అనారోగ్యంతో ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే పరిస్థితులు ఉన్నాయని, తగిన జాగ్రత్తలు ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. ఫ్లెక్సీలు బ్యానర్లతో ర్యాలీ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ఏదైనా అనారోగ్యం వస్తే వెంటనే స్థానికంగా యూపీహెచ్‌సీలకు వెళ్లి వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.



ప్రజలకు వడదెబ్బపై ముద్రించిన కరపత్రం

**పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**

ఏప్రిల్ నెలలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వాతావరణంలో తేమశాతం తగ్గుతూ వేడిగాలులు వీయటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడేవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఏలూరు నగరంలో శనివారం 40 డిగ్రీలు, శుక్రవారం 36, గురువారం 35, బుధవారం 36, మంగళవారం 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఏలూరులో వడదెబ్బపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న మలేరియా అధికారి గోవిందరావు (ఫైల్)

### జాగ్రత్తలు పాటించాలి



ప్రజలు ఎండ తీవ్రత నుంచి కాపాడుకునేందుకు తప్పకుండా గొడుగు వినియోగించాలి. ఎండలో బయటకెళ్తే తల తిరుగుడు, వాంతులు, అపస్మారక స్థితిలోకి వెళ్లే పరిస్థితి ఏర్పడితే వడదెబ్బగా గుర్తించాలి. పనులకు వెళ్లేవారు నెత్తిన టోపీ లేదా రుమాలు కట్టుకోవాలి. ఉదయమే పనులను ముగించుకోవటం, తిరిగి సాయంత్రం నాలుగు గంటల అనంతరం పనులు చేసేలా చూసుకోవాలి. చల్లటి నీరు, మజ్జిగ, కొబ్బరి బొండాల నీరు తీసుకుంటూ ఉండాలి. డీహైడ్రేషన్ వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఓఆర్ఎస్ నీటిని తీసుకోవాల్సి ఉంటుంది.

– ఆర్.మాలిని, వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఏలూరు

### వృద్ధులు, చిన్నారుల పట్ల అప్రమత్తం



వేసవిలో రోజూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యం పట్ల కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మందులు వాడుతున్న బాధితులు వైద్యుల సూచనల మేరకు ఆరోగ్య నియమాలు పాటించాలి. ఉక్కపోతతో ఇబ్బంది పడకుండా వదులు, కాటన్ దుస్తులు ధరించటం మంచిది. తేలికపాటి ఆహారం తీసుకోవాలి, ఎండ నుంచి ఇంటికి వచ్చిన అనంతరం నీరు, నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరినీరు తాగితే ఉపశమనం లభిస్తుంది.

– ఎంఎస్ రాజు, ఏలూరు జీజీహెచ్, సూపరింటెండెంట్

### డీ అడిక్షన్ సెంటర్‌లో తనిఖీ



డీ అడిక్షన్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారి ఆవులయ్య

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో యువత, విద్యార్థులు, ప్రజలు మత్తుకు బానిసలుగా మారకుండా ఉండేలా అవగాహన కల్పిస్తూ, చైతన్యవంతులను చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎ.ఆవులయ్య తెలిపారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని డీ అడిక్షన్ సెంటర్‌ను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అడిక్షన్ సెంటర్‌లోని రికార్డులను, బాధితులకు అందుతున్న వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రగ్ అడిక్షన్ సెంటర్‌తో ఎలాంటి ఫలితాలు వస్తున్నాయో సిబ్బందిని ఆరా తీశారు. జిల్లాలో ఇప్పటికే గుర్తించి 50 మంది మత్తు బానిసలను డీ అడిక్షన్ సెంటర్‌లో చేర్పించి చికిత్స అందించేలా చర్యలు చేపడతామని తెలిపారు. మత్తుకు బానిసలై విలువైన జీవితాన్ని కోల్పోవద్దని హితవుపలికారు. ఎక్సైజ్ శాఖ జిల్లా సహాయ అధికారి రంగారావు, ఏలూరు సర్కిల్ ఎక్సైజ్ సీఐ కృష్ణ ధనరాజ్, సిబ్బంది ఉన్నారు.

# వక్ఫ్ బోర్డు చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధం

ఏలూరు (టూటౌన్): వక్ఫ్ బోర్డ్ 2025 చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధమని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక సీపీఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో వక్ఫ్ బోర్డ్ 2025 చట్ట సవరణను వ్యతిరేకిస్తూ సీపీఐ ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం విశ్రాంతి జడ్జి అడబాల లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరావు, ముస్లిం జేఏసీ కన్వీనర్ మహమ్మద్ ఇలియాస్, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, ప్రముఖ న్యాయవాది పీపీ శాస్త్రి, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేత బి.ప్రభాకరరావు, సీపీఐ నాయకులు పి.కిషోర్ తదితరులు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ నాయకత్వాన 2014లో ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం ముస్లిం, క్రిస్టియన్, లౌకిక వాదులు, వామపక్షాలపైనా దాడులకు పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లింల హక్కులకు భంగం కల్పిస్తూ రాజ్యాంగ విరుద్ధంగా 2025 వక్ఫ్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదించి కేంద్రం అమలుకు సిద్ధమైందని, లౌకిక రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోందని పేర్కొన్నారు. లౌకిక వ్యవస్థ, ప్రజాస్వామ్య రక్షణ, మైనార్టీల హక్కుల సంరక్షణకు పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు రద్దయ్యేవరకు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నాయకులు నిర్ణయించారు.



మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి కృష్ణచైతన్య

# ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రభంజనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియట్ ఫలితాల్లో గత 23 ఏళ్లుగా ఏలూరు శ్రీచైతన్య విద్యార్థుల విజయ ప్రభంజనం కొనసాగుతోందని కళాశాల ఏజీఎం వీవీ రాంబాబు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో బి.శ్రీవల్లి శర్వాణి 991, ఆరేపల్లి నీతు శ్రీలాస్య 990, దొడ్డిగర్ల హన్సీ 990, బైపీసీలో పట్టపు కాత్యాయని కావ్యదీపిక 989, ఎంఈసీలో వి.చైతన్యశ్రీ 974, సీఈసీలో చలువాది మీనాక్షి 953 మార్కులు సాధించారని వివరించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో సీహెచ్ శృతి 466, పప్పల గ్రీష్మ 466, మామిడిశెట్టి దిల్సీ మహాలక్ష్మి 466, బైపీసీలో మేకా నాగలక్ష్మి 436, ఎంఈసీలో పీసపాటి అద్వైత 490, సీఈసీలో సీతల జాహ్నవి 473 మార్కులు సాధించారని తెలిపారు.

**శ్రీభారతి విజయకేతనం**

ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఏలూరు శ్రీ భారతి విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. సీనియర్ ఇంటర్‌లో జశ్వంత్ తేజ 990, జూనియర్ ఇంటర్‌లో కొనకళ్ల ధనుష్ 464 మార్కులు సాధించారు. అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల సహకారంతో 990 మార్కులకుపైగా ఎక్కువ మంది విద్యార్థులు సాధించారని ప్రిన్సిపాల్ అన్నపనేని రాజేంద్రకుమార్ తెలిపారు. విద్యార్థులను విద్యా సంస్థల చైర్మన్ అన్నపనేని రవికుమార్ అభినందించారని పేర్కొన్నారు.



శ్రీవల్లి శర్వాణి



కావ్యదీపిక



జశ్వంత్ తేజ



కొనకళ్ల ధనుష్

**జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ**

ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. జనరల్ ప్రథమ సంవత్సరంలో 114 మందికి 63 మంది, ఒకేషనల్‌లో 88 మందికి 56 మంది, జనరల్ రెండో సంవత్సరంలో 77 మందికి 66, ఒకేషనల్‌లో 68 మందికి 55 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ రాజ్ కృష్ణ తెలిపారు. జనరల్ సీనియర్ బైపీసీలో పీఎస్ భానుజ 962, కె.గగన 910, ఎం సోనియా 896, జనరల్ జూనియర్ బైపీసీలో పి.సహజ 409, ఎంపీసీలో ఎస్కే రిహాన్ 408, హెచ్ఈసీలో పండు పుల్లారావు 351 మార్కులు సాధించారని వివరించారు. ఒకేషనల్ సీనియర్ ఎంపీహెచ్‌డబ్ల్యూలో టి.కనక మహాలక్ష్మి 967, టి.వెంకట సాయవతి 940, ఎం అండ్ ఏటీలో ఎస్కే షబ్బీర్ 928, ఒకేషనల్ జూనియర్ ఎంపీహెచ్‌డబ్ల్యూలో జి.సుమశ్రీ 489, బి.భానుప్రకాష్ ఎం అండ్ ఏటీలో 488, జె.సంతోష్ కుమార్ 466 మార్కులు సాధించారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, అధ్యాపకులను ఆయన అభినందించారు.

# చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి.మంగ సూచించారు. స్థానిక లంకపేట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషన్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఇంటి విషయాల్లో పురుషుల పాత్ర అనే అంశంపై మహిళలకు అవగాహన కల్పించారు. మెరుగైన తల్లి సంరక్షణ, పోషకాహారం అందించడంలో తోడ్పాటు గురించి మంగ వివరించారు. క్రమం తప్పకుండా చిన్నారులకు పౌష్టికాహారం అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నప్పుడే ఎదుగుదల ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

### పూలే సెంటర్‌లో మజ్జిగ పంపిణీ



పూలే సెంటర్‌లో మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా కమిటీ, బీసీ ఎంప్లాయీస్ యూనియన్, బీసీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఓవర్ బ్రిడ్జి డౌన్‌లోని పూలే సెంటర్‌లో పాదచారులు, వాహనచోదకులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి మాట్లాడుతూ వేసవిలో నగరానికి వచ్చి వెళ్లేవారు సేదతీరే విధంగా మజ్జిగ పంపిణీ చేపట్టామని చెప్పారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద సంస్థలు, సంఘాలకు చెందిన వారు విరివిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, బీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు పామర్తి యేసు రాజు, బీసీ నాయకులు బాయి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరం

ఏలూరు (టూటౌన్): స్థానిక ఆర్ఆర్‌పేటలోని శ్రీకృష్ణ ఆస్పత్రిలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 103 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ బి.కృష్ణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### వరుస చోరీలతో ప్రజల్లో ఆందోళన

పెదపాడు: మండలంలోని వసంతవాడ గ్రామంలో వరుస చోరీలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలోని సుగ్రీవ లింగేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. శివాలయంలో తాళాలు గెడను పగులకొట్టి ఆలయంలోని నగదును దోచుకెళ్లారు. ఆలయ అర్చకుడు ఎల్ఏకే శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెద్ద చెరువుగట్టు వద్ద నాయీబ్రహ్మణ వీధిలోని ఆంజనేయస్వామి గుడి వద్ద రెండు సార్లు చోరీ జరిగింది. గతంలో పలు ఆలయాల చోరీ చేసి నగదు దోచుకెళ్లిన ఘటనలు ఉన్నాయని స్థానికులు పేర్కొన్నారు. చోరీ నివారణకు రాత్రి సమయంలో పోలీసులు గస్తీ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆశ్రం సెంటర్‌లో ప్రయాణికులకు అవస్థలు

- బస్సు షెల్టర్‌కు ఎదురుగా ఆటోల నిలుపుదల
- రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం ఆశ్రం వైద్యశాల జంక్షన్ నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఆశ్రం రోడ్డుకు ఇరువైపుల వ్యాపార దుకాణాలు నిర్వహించడం, బస్సు షెల్టర్‌కు ఎదురుగా ఆటోలు నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు బస్సులు వచ్చే వరకు రోడ్డుపైనే నిరీక్షించాల్సి వస్తుంది. సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో రోడ్డు కిరువైపులా వ్యాపార దుకాణాలు పెట్టవద్దని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా ఫలితం లేదని వాపోతున్నారు.



ఆశ్రం వద్ద రోడ్డుకిరువైపులా నిలిపివేసిన ఆటోలు



బస్టాండ్ వద్ద చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న దృశ్యం

### పోలీస్ బీట్ ఏర్పాటు చేయాలి



ఆశ్రం జంక్షన్ ఏలూరు, విజయవాడ, రాజమండ్రి వెళ్లేందుకు మూడు సెంటర్ల కూడలి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం. ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ లేకుండా బస్సు షెల్టర్లు కాపాడేందుకు రెగ్యులర్ పోలీస్ బిట్ ఏర్పాటు చేయాలి.

– గొల్ల కిరణ్, కొవ్వలి

### పర్యవేక్షణ ఉండాలి



జిల్లా అధికారులు భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ఏక నిబంధన అమలు చేయాలి. రోడ్డుకి ఇరువైపులా ఉన్న షాపులు తీసేయాలి. ఇక్కడ ఏదో ఒక నిబంధన అమలు చేయాలి. రాత్రి వేళల్లో పూర్తిస్థాయి పోలీస్ పర్యవేక్షణ ఉండాలి.

– మద్దా భూషణం, రామారావుగూడెం

## భారీగా అన్న సమారాధనలు



భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రజలందరినీ సోదర భావంతో ఒకచోటకు చేర్చేందుకే పూర్వీకులు అన్న సమారాధన సంస్కృతిని ప్రారంభించారని అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్యచంద్రరావు అన్నారు. స్థానిక అమీనాపేట అభయాంజనేయ స్వామి ఆలయంలో 90వ సీతారాముల కల్యాణ మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని శనివారం ఏర్పాటుచేసిన భారీ అన్నసమారాధనను ఏఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. అన్ని దానాలలో కెల్లా అన్నదానం చాలా ఉత్తమమైందని అన్నారు. ఇటువంటి ఆచారాలు మన సంస్కృతి గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేసేందుకు అద్భుతమైన మార్గాలని తెలిపారు. అభయాంజనేయ స్వామి ఆశీస్సులు జిల్లా ప్రజలు, పోలీస్ సిబ్బందిపైనా ఉండాలని, అందరూ సుఖ సంతోషాలతో, శాంతియుత జీవనాన్ని సాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, ఆర్ఐ పవన్ కుమార్, ఆర్ఎస్ఐలు, ఏఆర్ ఎస్సైలు, భక్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**గౌరీ శంకర ఆలయంలో..**

ఏలూరు తంగెళ్లమూడి గవరపేట గౌరీ శంకర ఆలయంలో ప్రతి పౌర్ణమి రోజు భారీ అన్న సమారాధన ఏర్పాటుచేస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం కాండ్రేగుల రాజకుమార్, రాధిక దంపతుల సౌజన్యంతో అన్నదానం చేశామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలి

గణపవరం: మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలని మెనూ ప్రకారం వంట చేయాలని, రాగిజావ నిర్ణీత రోజుల్లో తప్పకుండా పిల్లలకు ఇవ్వాలని డీఈవో వెంకటరమణ అన్నారు. శనివారం ఆయన గణపవరం మండలం కేశవరం, అప్పనపేట, మల్లపరాజుపేట గ్రామాల్లోని పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించారు. వంటలు నాణ్యంగా ఉండాలని నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. రాగి జావ తాగుతున్న విద్యార్థులను జావ నాణ్యతపై ప్రశ్నించారు. వారంలో మూడు రోజులు రాగిజావ ఇస్తున్నారా, లేదా అన్న విషయం ఆరా తీశారు. విద్యార్థులంతా తప్పనిసరిగా రాగి జావ తాగాలని, దీనివల్ల రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఉంటారని విద్యార్థులకు సూచించారు. వార్షిక పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో గొర్రెల బాలయ్య ఉపాధ్యాయులు ఉన్నారు.

## పెంచిన ఇంధనం ధరలు తగ్గించాలి

దెందులూరు: పెంచిన ఇంధనం ధరలను తక్షణమే తగ్గించాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి దేవదాస్ ప్రేమ్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఏలూరు రూరల్ మండలం మానూరులో ఆయన మాట్లాడారు. పెంచిన ఇంధనం ధరలు ప్రజలకు భారంగా మారాయని తెలిపారు. ప్రజారంజక పాలన చేస్తామన్న ప్రభుత్వాలు ప్రజలు నడ్డి విడిచేలా వారిపై అధిక భారం మోపేలా వారి జీవన విధానం కొంగ తీసేలా పాలన సాగిస్తున్నారని ఈ విధానం ఆమోదయోగ్యం కాదన్నారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 20 | అరటి కాయ (1) | 05-08 |
| వంకాయలు (గులాబీ) | 22 | చిక్కుడు కాయలు | 60 |
| వంకాయలు (కాంతులు) | 26 | బీన్లచిక్కుడు | 70 |
| వంకాయలు (తెలుపు) | 24 | చామదుంపలు | 54 |
| బెండకాయలు | 28 | ములక్కాడలు | 08, 10 |
| పచ్చిమిర్చి | 38 | కంద | 00 |
| కాకర కాయలు | 28-34 | బీట్‌రూట్ | 28 |
| బీరకాయలు | 34 | కీరా దోస | 30 |
| బీరకాయలు (పందిరి) | 40 | ఫ్రెంచ్‌బీన్స్ | 80 |
| క్యాబేజీ | 16 | అల్లం | 60 |
| క్యారెట్ | 32 | కొత్తిమీర (కట్ట) | 20 |
| దొండకాయలు | 22 | పాలకూర | 12 |
| బంగాళదుంపలు | 30 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 26 | చుక్కకూర | 12 |
| గోరుచిక్కుడు | 36 | గోంగూర | 07-10 |
| దోసకాయలు | 24 | పుదీనా | 05 |
| ఆనబకాయ (1) | 15-20 | క్యాప్సికమ్ | 60 |
| పొట్లకాయ(1) | 20-25 | చిలకడదుంప | 40 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

### ఏసీ బస్సులు..

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 09 |
| ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర) | 21.30 | 22 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి) | 22.00 | 13 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్) | 22.30 | 02 |
| ఏలూరు - తిరుపతి (ఇంద్ర) | 19.00 | రద్దు |

### సూపర్ లగ్జరీ

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 21.45 | 4820 | 15 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 21.15 | 4822 | 17 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 00 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 00 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 02 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 05 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 06 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 33 |